క్లుప్తంగా

మోటార్ సైకిల్ చోరీ

కొవ్వూరు: స్థానిక పాతపేటకు చెందిన సున్నం పుష్పలతకు చెందిన మోటార్ సైకిల్ చోరీకి గురైనట్లు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై కె.జగన్ మోహన్‌రావు తెలిపారు. ఆగస్టు 6న ఇంటి ముందు నిలిచి ఉంచిన మోటార్ సైకిల్‌ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు పోయారన్నారు. ఇప్పటి వరకూ వెతికినా దొరకకపోవడంతో బుధవారం ఫిర్యాదు అందించారని ఆయన వివరించారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

కొవ్వూరు: తన భర్త, అతని కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు పశివేదల గ్రామానికి చెందిన మెర్తా గంగారత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని రూరల్ ఏఎస్సై జె.ధర్మరాజు తెలిపారు. నిడదవోలుకు చెందిన ప్రసాద్‌తో గంగారత్నంకు వివాహం జరిగింది. ఇటీవల తరచూ అదనపు కట్నం తీసుకు రమ్మని భర్త, అతని తల్లిదండ్రులు, మరిది వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తెస్తాం

దేవరపల్లి: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. 5న రాజమహేంద్రవరంలోని మున్సిపాల్ కాలనీ క్రికెట్ గ్రౌండ్‌కు ఎదురుగా ఉన్న భవనంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. బుధవారం దుద్దుకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకు కాంగ్రెస్ పార్టీ దేవరపల్లి మండల అధ్యక్షుడు వెలగా రామకృష్ణ కార్యాలయాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జిల్లా కార్యకర్తల సమావేశం జరుగుతుందన్నారు.

మొక్కల పంపిణీ

ఉండ్రాజవరం: పాలంగిలో కేతా రామచంద్రరావు సంస్మరణార్థం ఆయన కుమారుడు కేతా మాణిక్యాలరావు మొక్కలను పంపిణీ చేశారు. జామ, కాశ్మీర్ గులాబీలతో పాటు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, కేతా రామారావు, నెహ్రూ, కృష్ణ, నాగేశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెరవలి: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కార్నెర్ల ప్రసాద్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ శింగంశెట్టి రమేష్ తెలిపారు. దీనికి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు హాజరవుతారన్నారు.

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీఆర్కే రాజు తెలిపారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

జీఓ నంబరు 117ను రద్దు చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు

నల్లజర్ల: ప్రభుత్వ విద్యా రంగానికి శాపంగా మారిన జీఓ నంబరు 117ను తక్షణమే రద్దు చేయాలని నల్లజర్లలో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ బుధవారం నిరసన తెలిపింది. మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని, రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు కొణతం నరహరి, జిల్లా అధ్యక్షుడు పి.శేషబ్రహ్మం, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ త్రినాథరావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసరావు, వి.ఉమాబాయి, జిల్లా కార్యదర్శి జి.రాంబాబు పాల్గొన్నారు.

కుల నిర్మూలనే లక్ష్యంగా కృషి

నిడదవోలు రూరల్: సమాజంలో కుల నిర్మూలనే లక్ష్యంగా కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) కృషి చేస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు అన్నారు. నిడదవోలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌక్ వద్ద కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు.

దసరా ఉత్సవాలకు వేళాయె..

- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- నేటి నుంచి ఉత్సవాలు


నిడదవోలు: దేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు నిడదవోలు నియోజకవర్గంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. నిడదవోలులోని చినకాశిరేవులో వేంచేసి ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. అయితే రైల్వే ట్రాక్ దాటుకుని ఆలయానికి వెళ్లడానికి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని ఆర్య వైశ్య కల్యాణ మండపం ముందు భాగంలో ఉన్న ఖాళీ స్థలంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి శరన్నవరాత్ర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. పట్టణ రజక వీధిలో ఉన్న ఆలయం వద్ద దుర్గ భవాని దీక్షా పీఠం ఆధ్వర్యంలో ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక్కడ 10 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని నిలిపారు. నంగాలమ్మ అమ్మవారి పూరిగుడి, రైల్వే స్టేషన్ రోడ్డులో దుర్గాదేవి ఆలయం వద్ద భారీ ఎత్తున సెట్టింగులు వేశారు. చింతచెట్టు వీధి, యాదవుల వీధి, రాయిపేట, వైఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేశారు.

నేడు కోటసత్తెమ్మ ఆలయంలో..

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న కోట సత్తెమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. 3వ తేదీ ఉదయం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతులచే కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. రోజూ అమ్మవారికి సహస్రనామ పూజలతో పాటు ఉదయం చండీ పారాయణ, సాయంత్రం హోమాలు నిర్వహిస్తారు. 9న మూలా నక్షత్రం, సరస్వతి పూజ, త్రిరాత్రి పూజ, 10న దుర్గాష్టమి, 11న మహర్నవమి, 12 విజయదశమి రోజు శమీ పూజతో పాటు ప్రత్యేక సహస్రనామ పూజలు నిర్వహిస్తామని ఈఓ హరిసూర్యప్రకాష్ చెప్పారు. సమిశ్రగూడెం పుంతలో ముసలమ్మ, లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయ సమేత రాజరాజేశ్వరీస్వామి, సింగవరం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల వద్ద దేవీ నవరాత్రులకు సెట్టింగులు వేశారు.

తాళ్లపూడి: శరన్నవరాత్ర మహోత్సవాలను తాళ్లపూడి, వేగేశ్వరపురం మేదర్ల వీధి, గజ్జరం తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించనున్నారు. తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో దసరా మహోత్సవాలు జరుపనున్నట్లు నిర్వాహకుడు నీలి సూర్యనారాయణ తెలిపారు. 12 విజయ దశమి రోజున రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శమిస్తారు. ఇదే రోజు గ్రామంలో రథోత్సవం ఉంటుంది. తాళ్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలోని గాయత్రిమాత మందిరంలో నవరాత్ర మహోత్సవాలు నిర్వహించనున్నారన్నారు. రోజూ తిథులను అనుసరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని టీటీడీ ధర్మప్రచార పరిషత్ సభ్యులు పరస రాధాకృష్ణ తెలిపారు.


చాగల్లు: చాగల్లు, మీనానగరం, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చిక్కాల గ్రామాల్లో అమ్మవారి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. చాగల్లు మాతంగి చెరువుగట్టుపై ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఉత్సవాలను నిర్వహించనున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో కుంకుమ పూజలు జరుగుతాయని, రాత్రి 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.



తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక విద్యుత్ దీపాలతో ఆకట్టుకుంటున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం



నిడదవోలులో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



చాగల్లులో ఉత్సవాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు

బాణసంచా తయారీలో అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న డీఎస్పీ దేవకుమార్, హాజరైన బాణసంచా తయారీదారులు

కొవ్వూరు: బాణసంచా తయారీ కేంద్రాల్లో నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని డీఎస్పీ జి.దేవకుమార్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో బాణసంచా తయారీదారులతో బుధవారం ఆయన సమీక్షించారు. ముడి సరకుని, తయారైన బాణసంచాలను వేర్వేరు చోట్ల ఉంచాలని సూచించారు. డివిజన్‌లో 14 తయారీ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో ఉండ్రాజవరం మండలం పిట్టల వేమవరం గ్రామానికి చెందిన తయారీదారుడి లైసెన్స్ ఇంకా రెన్యూవల్ కాలేదన్నారు. అయినప్పటికీ పరిమితికి మించి బాణసంచా తయారీ చేస్తున్నారని, నిల్వ ఉంచుతున్నట్లు గుర్తించామన్నారు. ఆ లైసెన్స్‌దారుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ప్రకటించారు. ఇప్పటికే ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాల వద్ద మంటలను అదుపు చేయడానికి అవసరమైన అగ్నిమాపక పరికరాలు, నీళ్ల సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు.

సెలవుల్లో పాఠశాలలు తెరవద్దు

తాళ్లపూడి: మండలంలోని పాఠశాలలకు ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారని ఎంఈఓ సీహెచ్ బాలామణి తెలిపారు. సెలవుల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అదనపు తరగతులు నిర్వహించరాదన్నారు. ఏవిధమైన ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు.

పారిశుధ్య పరిరక్షణ బాధ్యత

కొవ్వూరు: పారిశుధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ముగింపు సందర్భంగా కుమార దేవంలో సంపద తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఎంపీడీఓ కె.సుశీల, ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ శర్మ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంతలో వివిధ రకాల విత్తనాల (సీడ్) బాల్స్‌ను ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు చేతుల మీదుగా వాటర్ వర్కర్స్‌లో విడిచి పెట్టారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘ నాయకులు మద్దుల సత్యనారాయణ, మద్దుల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీలకు మనీషా



దేవరపల్లి: నాగాలాండ్‌లో జరగనున్న జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని మనీషా బేగం ఎంపికైనట్లు హెచ్‌ఎం పేరం రవీంద్రనాథ్, పీడీ టి.సరస్వతి తెలిపారు. పల్నాడులో సెప్టెంబర్ 30, ఈ నెల 1, 2 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్– 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మనీషా బేగం ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల నిరసన



నల్లజర్లలో మౌన దీక్ష చేపట్టిన కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగులు

నల్లజర్ల: తమను రెగ్యులర్ చేయకపోయినా కనీసం ప్రభుత్వం నూరు శాతం జీతం జీఓనైనా అమలు చేయాలంటూ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులు నల్లజర్లలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద బుధవారం శాంతియుత మౌన దీక్ష చేపట్టారు. జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జీవీపీ ప్రసాద్ మాట్లాడుతూ నూరు శాతం గ్రాస్ జీతం తీసుకునే విధంగా జీఓ ఇచ్చి సంవత్సరం దాటిందని, అది నేటికీ అమలు కాలేదన్నారు. 62 ఏళ్ల రిటైర్‌మెంట్ విధానం తమకు అమలు చేయాలని కోరారు. ఇదే సమయంలో నల్లజర్లకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి వీరంతా వినతి పత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆమె అన్నారు.

చేకూరి ఫౌండేషన్ చేయూత



వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఉండ్రాజవరం: చేకూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలో పేదలకు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సర్పంచ్ సాగి పద్మావతి అన్నారు. వెలగదుర్రు గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు బుధవారం దుప్పట్లు, పండ్లు అందజేశారు. ప్రవాస భారతీయుడు (ఎన్ఆర్ఐ) చేకూరి ఫౌండేషన్ అధినేత చేకూరి సత్యనారాయణరాజు ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఫౌండేషన్ ప్రతినిధి ఇందుకూరి కేశవరాజు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని మొర

దేవరపల్లి: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజలు వివరించారు. గ్రామంలో కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉందని మాధవరపు వెంకటేశ్వరరావు అధికారులకు వివరించారు. మడతల శంకరం మాట్లాడుతూ గతంలో పంచాయతీ నిధుల దుర్వినియోగంపై అధికారులు విచారణ జరిపినప్పటికీ, ఇంత వరకూ సంబంధితులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ సభ్యుడు పచ్చా రాంగోపాల్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు దుర్వినియోగం జరిగినట్టు అధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణ అనంతరం రూ. 20 లక్షలు దుర్వినియోగం జరిగినట్టు నిర్ధారించారన్నారు. దుర్వినియోగం జరిగిన నిధులు ఇంత వరకూ ఎందుకు రికవరీ చేయలేదని గ్రామస్తులు నిలదీశారు. చంద్రబాబు నాయుడు కాలనీలో రోడ్లు, మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని ఆ కాలనీ వాసులు పేర్కొన్నారు. గ్రామ నడిబొడ్డున ఇసుకవాగు మురుగునీటి కాలువ నుంచి దుర్గంధం వెదజల్లుతుందని, పూడిక తీసి సమస్య పరిష్కరించాలని పలువురు కోరారు. యాదవోలు రోడ్డు వద్ద నుంచి పోలీస్ స్టేషన్ వరకూ, మూడు రోడ్ల జంక్షన్ నుంచి టుబాకో బోర్డు వరకు ప్రధాన రహదారి ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.సత్యనారాయణ, ఎంపీడీఓ పి.ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రవికిశోర్ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన గ్రామ సభ

వీరన్నకు పరామర్శ



దుగ్గిరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నాయకులు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్నను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. వీరన్న తండ్రి దుగ్గిరాజు ఇటీవల మృతి చెందారు. దీంతో ఐ.పంగిడిలోని ఆయన స్వగృహానికి వెళ్లి దుగ్గిరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉప్పులూరి సూరిబాబు, ఐ.పంగిడి సర్పంచ్ గోశాల నాగర్జున, కంఠమణి రమేష్‌బాబు పాల్గొన్నారు.

గాంధీ మార్గం... స్ఫూర్తిదాయకం

- వాడవాడలా బాపూ జయంతి వేడుకలు
- నివాళి అర్పించిన నాయకులు, అధికారులు

సాక్షి నెట్‌వర్క్: గాంధీ మార్గం.. స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. ఆ మహాత్ముడి జయంతి సందర్భంగా నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. నిడదవోలు శాంతినగర్‌లోని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారం చేసేందుకే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చారన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. వైస్ చైర్మన్లు గంగులు వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు పాల్గొన్నారు. స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌లో పూజా గణపతి, కుమారస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని నిర్వహించారు. నిడదవోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 20 మంది చిరు వ్యాపారులకు ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు.

- నిడదవోలు పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. నిడదవోలు రూరల్ సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, ఎంపీడీఓ పి.శామ్యూల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కొవ్వూరు మెయిన్‌రోడ్డులోని గాంధీ విగ్రహానికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పూల మాలలు వేశారు. ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పాలెంపాటి చినబాబు చౌదరి, కొల్లేపర శ్రీనివాస్, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి పూలమాలలు వేశారు. ఇక్కడి శాఖ గ్రంథాలయంలో గాంధీ విగ్రహానికి దాత అద్దేపల్లి విజయ్‌కుమార్, అద్దేపల్లి కుమార్ నివాళి అర్పించారు. అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాస్, గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు పాల్గొన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మోర్త ఉన్నత పాఠశాలలో ప్రముఖ వక్త, పండితుడు వాడ్రేవు సుందర్రావు, హెచ్‌ఎం కె.శ్రీనివాసు మాట్లాడారు.
- గాంధీ చిత్రపటాలకు పెరవలి మండల కార్యాలయం వద్ద ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కుమారి, ఐకేపీ వద్ద ఏపీఎం రామకృష్ణ, విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏఈ నిచ్చల్ నివాళులర్పించారు.
- తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఏఎస్ఓ జె.వెంకటేశ్వరరావు, వీఆర్వోలు నివాళి అర్పించారు. వేగేశ్వరపురంలో స్వచ్ఛతా హి సేవ ముగింపు సందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించి గ్రామసభ నిర్వహించారు.
- దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు పూలమాలలు వేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కడిమి వీరకుమారి, యాదవోలులో పంచాయతీ వద్ద సర్పంచ్ సున్నం వరప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణలు గాంధీ విగ్రహానికి నివాళి అర్పించారు.
- గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద నిర్వహణాధికారి డి.అమూల్ శ్యామ్, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణలు గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.
- మల్లవరం గాంధీ ఆశ్రమంలో గాంధీ విగ్రహానికి ఏపీ గాంధీ స్మారక నిధి చైర్మన్ డాక్టర్ గాంధీ పీజీ ఖాజా పూలమాలలు వేశారు. సర్వోదయం మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ఆధ్వర్యంలో గాంధేయవాదులను సత్కరించారు.



నిడదవోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి నివాళి



నిడదవోలులో రోడ్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ



కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు



దేవరపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులకు సత్కారం



గోపాలపురం పొగాకు వేలం కేంద్రం వద్ద గాంధీకి నివాళులు అర్పిస్తున్న ఉద్యోగులు, రైతులు

పల్లెలు స్వచ్ఛ మల్లెలు కావాలి

నల్లజర్ల: పల్లెలు స్వచ్ఛ మల్లెలు కావాలని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ కరుణశ్రీ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రకాశరావుపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్వచ్ఛతా హి సేవ, మహాత్మా గాంధీ సేవా భావాలపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విస్తరణ సంచాలకులు డాక్టరు బి.గోవిందరాజులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: గ్రామాలు, పాఠశాలలు స్వచ్ఛంగా ఉన్నాయంటే పారిశుధ్య కార్మికులే కారణమని హెచ్‌ఎం చోడపునీడి రామాంజనేయులు అన్నారు. కానూరు ఉన్నత పాఠశాలలో పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించారు.



కానూరు ఉన్నత పాఠశాలలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వ్యాసరచన పోటీలో ద్వితీయ బహుమతి

పెరవలి: రాజమహేంద్రవరంలో గత నెల 30న నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో పెరవలి విద్యార్థిని జక్కంశెట్టి భవ్య సింధు ద్వితీయ స్థాయిలో నిలిచిందని ఎంపీడీఓ శింగంశెట్టి రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రాపాక ప్రమీల, నాయకులు బొడ్డు రామాంజనేయులు, సలాది శ్రీహరి, మారిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.



పెరవలిలో జిల్లా స్థాయి అవార్డు సాధించిన విద్యార్థినితో ఎంపీడీఓ